క్లుప్తంగా

ప్రత్యేక ఆధార్ శిబిరాలు

పెనమలూరు: మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నామని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. ఆమె మంగళవారం వివరాలు తెలుపుతూ ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, అప్‌డేట్ చేయటానికి నాలుగు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. చోడవరం గ్రామ పంచాయతీ, గంగూరు సచివాలయం -2లో 19, 20 తేదీల్లో క్యాంపు ఉంటుందన్నారు. గోసాల సచివాలయం-1, వణుకూరు సచివాలయం-1లో ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు ఉంటాయన్నారు. ఆధార్ కార్డు దారులు ఈ క్యాంపులను ఉపయోగించుకోవాలని సూచించారు.

'ఆయుష్మాన్ భారత్'పై సమీక్ష



పెనమలూరు: గంగూరులో మంగళవారం ఆయుష్మాన్ భారత్ అమలుపై మండల అధికారులు సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు గంగూరు సచివాలయం 1,2లలో ఆయుష్మాన్ భారత్ అమలువుతున్న పథకాల వివరాలు తెలుసుకున్నారు. దారిద్ర్యరేఖ దిగువనున్న వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పథకం అమలులో లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎండలో జాగ్రత్తలు పాటించాలి

మండల వైద్యాధికారి సంధ్య

గన్నవరం రూరల్: వడదెబ్బ నుంచి రక్షించుకోవడానికి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి జె.సంధ్య సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వణుకు పుట్టడం, మగతనిద్ర, శరీర ఉష్ణోగ్రత పెరగటం, పాక్షిక అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలని చెప్పారు. నీరు, పళ్ల రసాలు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలని, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని, రోజుకు 15 గ్లాసుల నీరు తాగాలని, పరిశుభ్రంగా ఉండాలని, మితంగా భుజించాలని, ఎండలో తిరగవద్దని, టోపీలు ధరించాలని, ఈ జాగ్రత్తలు పాటిస్తూ వడదెబ్బ బారిన పడకుండా ఉండాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవ్వటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నంకు చెందిన సయ్యద్‌బాజీ, రత్నం టైర్ల వ్యాపారం నిమిత్తం బైక్ పై విజయవాడ ఆటోనగర్‌కు వచ్చారు. వారు పని ముగించుకొని బైక్ పై మచిలీపట్నంకు బయలుదేరారు. కానూరు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు వచ్చేసరికి, గుర్తు తెలియని కారు వారు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీ కొట్టి ఆగకుండా వెళ్లి పోయింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు అవ్వటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేరారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన ఉండాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ జీఆర్ మోహనరావు అన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులోని 1947 ఐఎన్‌సీ లెదర్ ప్రొడక్ట్స్ కంపెనీలో అగ్నిప్రమాపక వారోత్సవాల సందర్భంగా కార్మికులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

పండుగలా 'జగనన్నే మా భవిష్యత్తు'



ప్రభుత్వ పనితీరును వివరిస్తున్న ఏఎంసీ చైర్మన్, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగా వాతావరణంలో జరుగుతోంది. కేసరపల్లి శివారు వీఎన్.పురం కాలనీలో ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగ రాజకుమారి, గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమానిక నేతృత్వంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వల్ల అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, పార్టీ నేతలు రామిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దావాజిగూడెంలో ఉప సర్పంచ్ వేల్పూరి బసవరావు, పార్టీ నేత గుర్రం బుజ్జి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు. కేసరపల్లిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు అంజనేయ వరప్రసాద్, సచివాలయ కన్వీనర్ వీరప్రసన్న, గృహ సారథులు కొడాలి వాణి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని కొత్తగూడెం గ్రామంలో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సర్పంచి తూంపాటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ, పార్టీ నాయకులు శివశంకర్, మోహనరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం

కంకిపాడు: ప్రజా సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పునాదిపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఆయా కుటుంబాలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, ప్రజాభిప్రాయం సేకరించారు. ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం సంక్షేమ పాలన సాగిస్తుందన్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను, సచివాలయాల ద్వారా పరిపాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రతిపక్షాలు సాగిస్తున్న కుట్రలు, విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రభుత్వానికి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తొడుసు శ్రీను, మల్లెల వేణు, వలంటీర్లు పాల్గొన్నారు.



పునాదిపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు

పెనమలూరు అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి



శిరీషా మానసిక వికలాంగుల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న దివ్యాంగులు



కంకిపాడులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



కానూరులో చీరలు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచి అన్నే చిట్టిబాబు, వేమూరి బాలకృష్ణ

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పార్థసారథి కృషి చేస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పుట్టిన రోజు వేడుకలు కంకిపాడు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. రాచూరి ఫౌండేషన్ సహకారంతో జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి వితరణతో 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ బాకీ రమణ, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఉయ్యూరు: ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలు ఉయ్యూరు పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శిరీషా మానసిక వికలాంగుల కేంద్రం, సెయింట్ లూకాస్ అనాథ పాఠశాలలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. పలు చోట్ల పార్టీ శ్రేణులు, అభిమానులు కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. ఉయ్యూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరులో సేవా కార్యక్రమాలు

పెనమలూరు: స్థానిక శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలు మండల పరిధిలో మంగళవాం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. తాడిగడప మున్సిపాలటీ పరిధి కానూరులో మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, వేమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పేదలకు చీరులు పంపిణీ చేశారు. అంగిరేకుల సీతారామయ్య, తుమ్మల వరదీష్, పిన్నబోయినరవి, ఆంజనేయప్రసాద్, పోలవరపు మధు పాల్గొన్నారు. సనత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కేక్‌కట్ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు చాన్‌బాషా, పఠాన్ అహ్మద్ షేక్.ఖాదర్ పాల్గొన్నారు. వణుకూరులోని వృద్ధుల ఆశ్రమంలో పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉప సర్పంచి శీలం సుమతి, గాలంకి లక్ష్మి, వీరంకి రాఘవులు, ముంత ఉపేంద్ర, బొమ్మిడి అన్నపూర్ణ, గాలంకి సుబ్బారావు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పెనమలూరు: పోరంకిలో జరిగిన తన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. పోరంకి సెంటర్‌లో సోమవారం రాత్రి ఎమ్మెల్యే పార్థసారథిని పూలతో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శాలువ కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జన్మదిన కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో టిట్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నేతలు పాల్గొన్నారు. తాడిగడపలో వైఎస్సార్ సీపీ నేతలు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు.

మామిడి, ఆయిల్‌పామ్ సాగులో జాగ్రత్తలు అవసరం

మామిడి పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త స్రవంతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: మామిడి, అయిల్‌పామ్ తోటల్లో చీడపీడలు, తెగుళ్ల వ్యాప్తిపై రైతులు అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు పాటించాలని మామిడి పరిశోధనా కేంద్రం (నూజివీడు) కీటక శాస్త్రవేత్త డాక్టర్ జి.స్రవంతి అన్నారు. బాపులపాడు మండలంలోని రేమల్లే, మల్లవల్లి గ్రామాల్లో మామిడి, ఆయిల్‌పామ్ తోటలను ఉద్యాన అధికారులతో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. అయిల్‌పామ్ తోటల్లో తెల్లదోమ ఉధృతిని గుర్తించారు. పసుపు రంగు జిగురు అట్టలను చెట్లకు కట్టడం ద్వారా తెల్లదోమ అట్టకు అతుక్కుని చనిపోతుందని, తద్వారా తెల్లదోమను నివారించవచ్చని శాస్త్రవేత్త స్రవంతి వివరించారు. మామిడి తోటల్లో తేనెమంచు పురుగు, తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించారు. తేనెమంచు పురుగు ఆకుల రసం పీల్చి విసర్జించటం వల్ల మసి తెగులు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ మసి తెగులు నివారణకు కార్బండిజం 12 శాతం, మ్యాన్కోజ్ 65 డబ్ల్యూ ద్రావణాన్ని 2 మిల్లీ గ్రాముల చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. బాపులపాడు, కంకిపాడు మండల ఉద్యాన అధికారులు హరిచంద్, చందు జోసఫ్ సుందరం, మల్లవల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ తూము రాధాకృష్ణామూర్తి, చిన్నాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మామిడి తోటలను పరిశీలిస్తున్న కీటక శాస్త్రవేత్త స్రవంతి, ఉద్యాన అధికారులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ముదినేపల్లిరూరల్: బాధిత కుటుంబానికి వైద్య విద్యార్థిని మంగళవారం ఆర్థిక సాయం అందజేసింది. మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంకు చెందిన చిల్లిముంత నాగమల్లేశ్వరరావు పక్షవాతంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్ కుమార్తె, వైద్య విద్యార్థిని వైష్ణవి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేలు సాయం అందజేసింది.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన కొత్తూరు ప్రియాంకకు సీఎం సహాయనిధి కింద రూ.18 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ సక్కా గాంధీ, సర్పంచ్ పల్లపోతు జాన్‌ప్రకాష్, వైస్ ఎంపీపీ పందు రాణి చేతుల మీదగా ప్రియాంకకు అందించారు. సీఎం సహాయనిధి మంజూరుకు సిఫార్సు చేసిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహామూర్తి, ఉప సర్పంచ్ మజ్జి దీవెనకుమార్, మాజీ ఉప సర్పంచ్ పందు నాగార్జున పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

ఉంగుటూరు: గన్నవరం మండలం వీరపనేని గూడెంలో జూద శిబిరంపై ఆత్కూరు పోలీసులు మంగళవారం మెరుపు దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరపనేని గూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో నాలుగు కార్లు, 7 బైక్‌లు, ఆరు కోళ్లు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.9200 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి క్రీడాకారుల సాయం



కానూరులో సాయం అందిస్తున్న క్రీడాకారులు

పెనమలూరు: నిరుపేద కుటుంబానికి జిమ్ క్రీడాకారులు మంగళవారం సాయం అందించారు. బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అశోక్ జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్ వివరాలు తెలుపుతూ కామయ్యతోపులో నిరుపేద కుటుంబాలనికి చెందిన వెంకట్ కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వారి ఇద్దరు పిల్లలకు మతిస్థిమితం లేదని తెలిపారు. వెంకట్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో తినడానికి తిండిలేక ఉన్నారన్నారు. పేద కుటుంబానికి క్రీడాకారులు ముందుకు వచ్చి రూ. 5వేలు ఆర్థిక సాయం అందించగా, నవజీవన్ బాలభవన్ కోఆర్డినేటర్ ఎంవై.రత్నం సహకారంతో నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదారాజేష్, మాతృహృదయ్ సేవా సంస్థ నిర్వాహకులు తాళ్లూరి క్రిప్సినమ్మ, శారద క్రీడాకారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కేసు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తప్పవని గన్నవరం పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ ప్రధాన్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై పీడీఎస్, రెవెన్యూ అధికారులు రేషన్ బియ్యం అక్రమ రవాణాపై వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో లారీలో 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. దీంతో లారీ ఓనర్ శివరాం, డ్రైవర్ వీరబాబులపై వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి పథకానికి బడ్జెట్ పెంచాలి

కంకిపాడు: ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంపుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నేత కోసూరు శివనాగేంద్రం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న మచిలీపట్నంలో చేపట్టిన జాతా మంగళవారం గొడవర్రు గ్రామానికి చేరుకుంది. జిల్లాలో 70 శాతం మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని సమర్థంగా అమలు చేయటంతో పాటుగా, బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, టీ. నరేష్, కె.కొండలబాబు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం మెరుగు



నవ ధాన్యాల సాగు గురించి వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఖరీఫ్ సీజన్‌కు ముందు నవధాన్యాలను సాగు చేయటం ద్వారా భూసారం పెరుగుతుందని, తద్వారా మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి అన్నారు. బాపులపాడు రైతుభరోసా కేంద్రంలో నవధాన్యాల సాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్‌లో ప్రధాన పంటను వేసే ముందుగా 32 రకాల నవధాన్యాలు పొలంలో చల్లుకుని 45 రోజులకు భూమిలో కలియదున్నటం వల్ల భూసారం పెరుగుతుందని వివరించారు. ఎంఏవో జొన్నలగడ్డ భవాని, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ నాగ మల్లేశ్వరి, వీఏఏ పూర్ణ, శారద, రాజేష్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు మత్తి లక్ష్మీమాధవి, వార్డు సభ్యుడు ఉదయశంకర్ పాల్గొన్నారు.

22 నుంచి ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉచితంగా పుస్తకాల పంపిణీ చేస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజినీరింగ్, వైద్య విజ్ఞాన శాస్త్రాలతోపాటు కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్యం, చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం తదితర విషయాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తత్వశాస్త్ర గ్రంథాలు 2,200, మత, ఆధ్యాత్మిక గ్రంథాలు 7,400, సాంఘిక శాస్త్రాలు 3,300, శాస్త్ర సాంకేతిక రంగానికి చెందిన 5,000, ఆంగ్ల-తెలుగు సాహిత్యానికి చెందిన 5,800, చరిత్ర గ్రంథాలు 1,800, ఇంకా 8,000 పుస్తకాలకు పైగా ఇంజినీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి వివిధ విద్యాసంస్థల స్టడీ మెటీరియల్ కూడా ఉన్నాయని చెప్పారు. ఆయా తేదీల్లో ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు బెంజిసర్కిల్ వద్ద ఉన్న సర్వోత్తమ గ్రంథాలయంలో పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. విషయ ప్రాధాన్యత ప్రకారం పుస్తకాల ప్రదర్శన చేస్తున్నామని తెలిపారు. ఈ పుస్తకాల పంపిణీలో ఎవరైనా తమకు ఇష్టమైన రెండు పుస్తకాలను ఎంపిక చేసుకుని తీసుకెళ్లవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఉపాధి' పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచి వెంకటేశ్వరరావు

గన్నవరం రూరల్: ఉపాధి పనుల్లో కూలీలు ముమ్మరంగా పాల్గొనాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉదయం 6గంటలకే ఉపాధి పనుల ప్రదేశాలకు కూలీలు చేరుకోవాలని చెప్పారు. 10 గంటలలోపు ఇచ్చిన నిర్ణీత కొలతల ప్రకారం పనులు పూర్తి చేసుకుంటే ఎండల బారిన పడే పరిస్థితులు తప్పుతాయన్నారు. ప్రభుత్వం ప్రతిరోజు కూలీలకు మస్టర్‌గా రూ.272 అందజేస్తుందని చెప్పారు. సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు, ఏపీవో సత్యప్రియ, ఉపాధి మేట్లు, ఎఫ్‌ఏ పాల్గొన్నారు.

4నుంచి నృసింహస్వామి జయంత్యుత్సవాలు

జుఝవరం(పామర్రు): అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు, ఆది మధ్యాంత రహితుడు కోరిన వారికి కొంగు బంగారమై వెలుగొందుతున్న శ్రీనృశింహస్వామి ఆలయ జయంతి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుమారు 400 సంవత్సరాల క్రితం గ్రామంలోని వ్యవసాయదారుడైన కలకోటి నరసారెడ్డి దంపతుల ఇంట్లో తవ్వకాల్లో స్వయంభుగా వెలసిన శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని గ్రామస్తుల సహకారంతో అక్కడే ఆలయం నిర్మించి ప్రతిష్టించారని ప్రతీతి. ఆ తర్వాత గ్రామస్తులు అందరూ కలిసి నృశింహ స్వామి పక్కనే రాజ్యలక్ష్మీ అమ్మవారి విగ్రహాన్ని కూడా ప్రతిష్టించారు.

4న శాంతి కల్యాణం

మే నెల 4వ తేదీ వైశాఖ శుద్ధ చతుర్దశి గురువారం ఉదయం స్వామివారికి విశేష మూలా చతుర్దశ కలశ స్నపన, పెండ్లికుమారునిగా చేయటం, రాత్రి 7గంటలకు స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 5వ తేదీ మధ్యాహ్నం స్వామివారి సన్నిధిలో అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 7 గంటల నుంచి స్వామివారి నృసింహ సేవ(కోలలు), గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది. 6వ తేదీ ఉదయం విశేష నారసింహ వ్రతాలు జరుగుతాయని, సాయంత్రం పవళింపు సేవలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేయండి

గన్నవరం రూరల్ : కొత్తగా ఆన్‌లైన్లో పొలాలను నమోదు చేసుకున్న రైతులు 'వైఎస్సార్ రైతు భరోసా' పథకం పొందేందుకు దరఖాస్తులు అందజేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజశ్వి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి 'రైతు భరోసా' పథకానికి అర్జీ పెట్టుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. ఈ నెలాఖరు వరకూ రైతులు దరఖాస్తు చేసుకోచ్చని చెప్పారు. కొత్తగా ఎవరైనా రైతులు పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించుకుంటే ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని రైతులు వారి వివరాలతో దగ్గరలోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. 1బీ, పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు అక్కౌంట్, ఫోన్ నంబర్ తీసుకుని ఆర్‌బీకేలలో వీఏఏలను సంప్రదించాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.